# ఆగ్రహించిన అంగలూరు

**గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే**

**పంటచేలను చేపల చెరువులుగా మార్చేందుకు రంగం సిద్ధంకావడంతో గ్రామం సర్వనాశనం కాబోతోందంటూ అంగలూరు గ్రామస్థులు బుధవారం పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టారు. పామర్రు సి.ఐ. దురుసుతనం కారణంగా ఆందోళన కార్యక్రమం ఉద్రిక్తంగా మారింది. నిర్బంధించిన గ్రామస్థులకు ఆయన క్షమాపణలు చెప్పడంతో పరిస్థితి సద్దుమణిగింది. జిల్లా మంత్రి ఒకరు లక్షల రూపాయల ముడుపులు తీసుకొని చేపల చెరువుల తవ్వకాలకు అనుమతులిచ్చారంటూ గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేయడం గమనార్హం.**



తహసీల్దార్, ఆందోళనకారులతో చర్చిస్తున్న డీఎస్పీ కె.ఎస్.ఎన్.మూర్తి

మండలంలోని అంగలూరు తూర్పు వైపు పొలాలను చేపల చెరువులుగా తవ్వేందుకు అన్ని అనుమతులూ పూర్తై కలెక్టర్ ఉత్తర్వులు మాత్రమే నిలిచిపోయాయంటూ గ్రామస్థులకు సమాచారం అందింది. దీంతో మంగళవారం రాత్రి నుంచి ఎస్సీ, బీసీ వర్గాలకు చెందిన వ్యవసాయకూలీలు బుధవారం పెద్దఎత్తున ధర్నా, రాస్తారోకో చేయాలని నిర్ణయించుకున్నారు. విషయం తెలియడంతో తహసీల్దార్ వెంకటేశ్వరరావు ఉదయాన్నే గ్రామానికి చేరుకొని రైతు ప్రముఖుడు, కాంగ్రెస్ నాయకుడు దుగ్గిరాల శేషబాబుని కలిసి, ఆందోళనలు వద్దనీ, తనకు వినతిపత్రం ఇస్తే కలెక్టర్‌కు పంపుతానని వేడుకున్నారు. అయితే గ్రామస్థులు ససేమిరా అన్నారు. ఉదయం గం.9.30 నుంచి వారు ప్రధాన ఎం.ఎన్.కె. రహదారిపై బస్సుస్టాండ్ సెంటర్‌లో రాస్తారోకో చేపట్టారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు (మూడున్నర గంటల పాటు) వారు ధర్నా నిర్వహించారు. చేపల చెరువుల తవ్వకాలతో తాగునీటి వనరులు కలుషితమవుతాయనీ, ఉపాధి పోతుందని వారు నిరసన వ్యక్తం చేశారు. వ్యవసాయ కూలీల సంఘం ఆధ్వర్యంలో చిలుముల రాధాకృష్ణ, చేబ్రోలు సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు ముత్యాల నాగేశ్వరరావు, త్రిపురనేని ద్వారకాప్రసాద్, ఒగిరాల రంగారావు, ప్రసాద్, కొండలు, డ్వాక్రా సంఘం నేత రమణ తదితరులు ఈ రాస్తారోకోలో పాల్గొన్నారు.

రాస్తారోకోతో ఎం.ఎన్.కె. రహదారిపై ఇరువైపులా పెద్దఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. దాదాపు రెండు గంటల అనంతరం ఆర్.ఐ. ప్రసాద్‌బాబు వచ్చి తవ్వకాలకు అనుమతులు రాలేదని వెల్లడించగా.. అలా కాదు తహసీల్దార్ వచ్చి సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేశారు. అప్పుడే వచ్చిన పామర్రు సి.ఐ. వెంకన్నదొర మొండిగా వ్యవహరిస్తున్న ఆందోళనకారులపై అసహనం, ఆగ్రహం వ్యక్తంచేశారు. శేషుబాబును ఆయన తోసివేశారు. అడ్డువచ్చిన డ్వాక్రా మహిళనూ అసభ్య పదజాలంతో తూలనాడారు. 'అందర్నీ జీప్‌లో పడేయండి..' అంటూ సిబ్బందికి పురమాయించి, వ్యవసాయకార్మిక సంఘం డివిజన్ కార్యదర్శి పిడుగు దేవసహాయాన్ని జీప్‌లోకి ఎక్కించారు. దీంతో గ్రామస్థులు ఆగ్రహోదగ్రులయ్యారు. జీప్‌లో కూర్చున్న సి.ఐ.ని కదలకుండా అడ్డుకొని గంటసేపు ఆయన్ను నిర్బంధించారు. జీప్ ముందు రోడ్డుపైనే వారు బైఠాయించారు. పరుష పదజాలంతో మహిళలు, రైతులు సి.ఐ.ని దుమ్మెత్తిపోశారు. చివరికి సి.ఐ. వెంకన్నదొర ఆందోళనకారులకు, మహిళలకు క్షమాపణ చెప్పడంతో ఆయన్ని వెళ్లనిచ్చారు. దీంతో ఒంటరిగా ఆయన జీప్‌లో గుడ్లవల్లేరు పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు.

పరిస్థితి విషమించడంతో గుడివాడ డీఎస్పీ కె.ఎస్.ఎన్.మూర్తి, టౌన్ సి.ఐ. జి.రామకృష్ణ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఆందోళనకారులను వారించారు. రాస్తారోకో చేయాలనుకుంటే ముందస్తు అనుమతి తీసుకోవాలని సూచించారు. వారికి సర్దిచెప్పడంతో వారు రాస్తారోకోను విరమించారు. ఈలోగా తహసీల్దార్ వెంకటేశ్వరరావు శేషుబాబును ఆయన ఇంటికి వస్తే మాట్లాడతానని కబురుచేశారు. ఇందుకు శేషుబాబు నిరాకరించి, ప్రజల మధ్యే వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో ఆయన వచ్చి డీఎస్పీ సమక్షంలో మండల తహసీల్దార్ కార్యాలయానికి నేటి వరకూ చెరువుల తవ్వకానికి సంబంధించి ఎలాంటి అనుమతులూ రాలేదని స్పష్టం చేశారు.